2016 గ్రూప్-1 రీఎగ్జామ్స్ నుంచి ఇప్పటివరకు జరిగిన

# అన్ని పరీక్షలపై సిబిఐ విచారణ చేయించాలి

గ్రూప్-1 ప్రిలిమ్స్ జెన్యూన్ క్వాలిఫై అభ్యర్థులు డిమాండ్

**హైదరాబాద్, మార్చి 19, ప్రభాతవార్త:** 2016 గ్రూప్-1లో కూడా అక్రమాలు జరిగినట్టు వార్తలు వస్తున్న నేపథ్యంలో 2016 గ్రూప్-1 రీఎగ్జామ్స్ దగ్గర నుంచి ఇప్పటి వరకు జరిగిన అన్ని పరీక్షలపై సీబీఐ అధ్వర్యంలో విచారణ జరిపించాలని గ్రూప్-1 ప్రిలిమ్స్ జెన్యూన్ క్వాలిఫైడ్ అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు. 2016లో జరిగిన గ్రూప్-1 రీఎగ్జామినేషన్స్‌లో జరిగిన అక్రమాలపై తాను ఎంతో పోరాటం చేసినట్టు అభ్యర్థి వెంకటేశ్వర్లు తెలిపారు. మొదట గ్రూప్-1 పేపర్ లీకేజీ వల్ల లాభం పొంది క్వాలిఫై అయిన అభ్యర్థులను సైబర్ సెక్యూరిటీ టెక్నాలజీ ఉపయోగించి గుర్తించాలన్నారు. లీకేజీ వల్ల క్వాలిఫై అయిన అభ్యర్థుల జాబితాను గుర్తించి రాబోయే జరగబోయే టీఎస్‌పీఎస్‌సీ గ్రూప్-1, 2, 3, 4 అన్ని పరీక్షలు, యూపీఎస్‌సీతోపాటు అన్ని రాష్ట్ర, జాతీయస్థాయి పరీక్షలను రాయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని జెన్యూన్ క్వాలిఫైడ్ అభ్యర్థులు ప్రభుత్వాన్ని కోరారు. భవిష్యత్తులో ఇటువంటివి ఎవరు చేయకుండా వారిపై కేసులు నమోదు చేసి.. కోటి రూపాయల జరిమానా విధించాలన్నారు. లేదంటే జీవితకాల శిక్షలు వేయాలన్నారు. జెన్యూన్‌గా క్వాలిఫై అయిన వారికి త్వరలో పెట్టబోయే గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షలో 10 శాతం వెయిటేజీ ఇవ్వాలన్నారు. క్వాలిఫై అయిన వారందరి సమయం, డబ్బులు కోల్పోయిన వారికి నష్టపరిహారం చెల్లించాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే కోర్టులో కేసులు పెట్టాలని భావిస్తున్నట్టు గ్రూప్-1 ప్రిలిమ్స్ జెన్యూన్ క్వాలిఫైడ్ అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు. టీఎస్‌పీఎస్‌సీ నిర్వహించిన పరీక్షలపై సమగ్రమైన విచారణ జరిపించాలని తెలంగాణ నిరుద్యోగ జేఏసీ ఛైర్మన్ నిజ్జన రమేష్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. సీడీపీవో పరీక్షను కూడా రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

# స్వప్నలోక్ అగ్నిప్రమాదం దురదృష్టకరం

- ఉద్యోగం కోసం వచ్చిన యువత కలలు మంటల్లో మసి
- ప్రమాదంపై ప్రధానితో మాట్లాడి సాయం కోరా
- ప్రమాదాలపై స్పందించాలంటూ సిఎంకు లేఖ రాశా: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



స్వప్నలోక్ మాల్‌ను పరిశీలించిన తర్వాత మీడియాతో మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్ (బేగంపేట) మార్చి 19, ప్రభాతవార్త :** సికిందరాబాద్ పరిధిలో మూడు రోజుల క్రితం స్వప్నలోక్ కాంప్లెక్సులో జరిగిన అగ్నిప్రమాదం దురదృష్టకరమైన ఘటన అని కేంద్ర మంత్రి గంగాపురం కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. అగ్నిప్రమాదం జరిగిన స్వప్నలోక్ కాంప్లెక్సును మహంకాళీ జిల్లా అధ్యక్షుడు బూర్గుల శ్యాంసుందర్‌గౌడ్, రాంగోపాల్‌పేట, మోండా కార్పొరేటర్లు చీరె సుచిత్రా శ్రీకాంత్, కొంతం దీపిక, అధికారులతో కలిసి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా అధికారులను అడిగి వివరాలను తెలుసుకున్నారు. ప్రమాదం జరిగిన 4,5,6,7అంతస్తులను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ అగ్ని ప్రమాదం ఘటనలో ఆరుగురు యువతీయువకులు మృతి చెందడం పట్ల ఆయన విచారం వ్యక్తం చేసారు. ఉద్యోగం కోసం వచ్చిన యువత కలలు మంటల్లో కాలిపోయాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అగ్నిప్రమాదాల నివరణ కోసం కఠినంగా వ్యవహరించాలన్నారు. ప్రమాదాలు సంభవించినప్పుడు కమిటీలు ఏర్పాటు చేయడం మినహా నివారణకు కృషి చేయడం లేదని కిషన్‌రెడ్డి విమర్శించారు. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ నుండి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు ఉంటాయని, మృతులకు నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. ప్రమాదఘటనలో ఆరుగురు ప్రాణాలు కోల్పోయిన విషయాన్ని తాను ప్రధాని మోడీ దృష్టికి తీసుకెళ్లానన్నారు. కేంద్రం నుంచి రెండు లక్షల రూపాయలు నష్టపరిహారం ఇవ్వనున్నట్లు కిషన్ రెడ్డి తెలియజేసారు. అక్రమ కట్టడాలకు జీహెచ్‌ఎంసీ ప్రోత్సహిస్తూ రెగ్యులరైజేషన్ పేరుతో ఖజానా నింపుకోవడమే తప్ప ప్రమాదాలకు నివారణకి ఏమాత్రం పాటుపడటం లేదని ఆయన ఆరోపించారు. సికింద రాబాద్ పరిసర ప్రాంతాల్లో పెద్దఎత్తున జరిగిన అగ్నిప్రమాదాల్లో ప్రాణ, ఆస్తినష్టం వాటిల్లిందన్నారు. ప్రమాదాల వలన కాంప్లెక్సు, అపార్ట్‌మెంట్ వాసులు భయాందోళనలకు గురవుతున్నారని అన్నారు. ప్రతి అగ్నిప్రమాదంలో అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. జీహెచ్‌ఎంసీ ప్రభుత్వం ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్న ఆలోచన లేదన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ప్రమాదాలపై తాను లేఖ కూడా రాసానని ఆయన గుర్తు చేసారు. జనావాసాల మధ్య స్క్రాప్ దుకాణాలు ఉంచకూడదన్నారు. పాత అపార్టమెంట్స్‌లో ప్రమాదాల నివారణకు సంబంధించిన మౌలిక సదుపాయాలు లేవన్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగే అవకాశం ఉన్న ప్రాంతాల్లోని భవనాలను గుర్తించి ఫైర్, విద్యుత్ శాఖలు సమన్వయంతో పనులు చేయాలన్నారు. ప్రభుత్వం ఫైర్ సిబ్బందికి అధునాతన యంత్రాలు, మౌలిక సదుపాయాలను కల్పించాలన్నారు. ఆదాయం కోసం అక్రమ నిర్మాణాలను జీహెచ్‌ఎంసీ ప్రోత్సహిస్తున్న విధానం తననెంతో బాధిస్తుందన్నారు. ఉద్యోగాల కోసం కంపెనీలు అక్రమ షరతులు పెడితే వాటి పని పడతామని ఆయన హెచ్చరించారు. ఎవరైనా అక్రమ షరతులు పెడితే తన కార్యాలయాన్ని సంప్రదించాలని కిషన్‌రెడ్డి నిరుద్యోగ యువతకు సూచించారు. ప్రమాదంపై ప్రధానితో మాట్లాడి ఆర్ధిక సహాయం కోరానన్నారు. మృతుల కుటుంబాలకు రెండు లక్షల చొప్పున ప్రధాని ఎక్స్‌గ్రేషియా ప్రకటించారని తెలియజేసారు. సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో గడచిన కొద్ది కాలంగా జరిగిన వరుస ప్రమాదాల్లో 28మంది వరకు ప్రాణాలు కోలోయారన్నారు. పాత అపార్ట్‌మెంట్లపై పర్యవేక్షణ చేయాలని, సీఎస్‌కు లేఖ రాస్తానన్నారు. బిల్డింగ్ విషయంలో నిపుణుల సూచనలను ప్రభుత్వం అమలు చేయాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట బిజెపి నాయకురాలు బండ కార్తీకారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ జెన్‌కో, డిస్కంలపై భారం తగ్గించే యత్నం

- థర్మల్ స్థానంలో ప్రత్యమ్నాయంపై దృష్టి
- 69 శాతానికి తగ్గనున్న బొగ్గు వినియోగం
- పునరుత్పాదక ఇంధన వనరుల పెరుగుదల
- వ్యూహాత్మక ప్రణాళికను రూపొందించిన కేంద్రం

**హైదరాబాద్, మార్చి 19, ప్రభాతవార్త:** విద్యుత్ ఉత్పత్తి సంస్థలు, పంపిణీ సంస్థలపై భారం తగ్గించేందుకు కేంద్రం వ్యూహాత్మక ప్రణాళికను రూపొందించింది. విద్యుత్ ఉత్పత్తిలో ప్రధాన పాత్ర పోషిస్తున్న బొగ్గు వినియోగం తగ్గనుంది. ప్రస్తుతం దేశంలో మొత్తం స్థాపిత విద్యుత్ సామర్థ్యం 410 గిగావాట్లలో 50 శాతం బొగ్గును కలిగి ఉంది. మొత్తం మీద థర్మల్ విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం దాదాపు 236 గిగావాట్లుగా ఉంది. అంతేకాకుండా హైడ్రో ప్రాజెక్టుల ద్వారా 52 గిగావాట్లు, పునరుత్పాదక ఇంధన వనరుల ద్వారా 115 గిగావాట్లు, అణు విద్యుత్ ప్లాంట్ల నుండి 6.8 గిగావాట్లు మేర సామర్థ్యంతో పనిచేస్తున్నాయి. వేసవి సీజనులో ముఖ్యంగా ఏప్రిల్ నుండి జూన్ వరకూ విద్యుత్ డిమాండ్ సాధారణం కంటే 14 శాతం ఎక్కువగా ఉండటం, ఇందుకు తగినట్లుగా ఉత్పత్తిని పెంచేందుకు థర్మల్ పవర్ ప్రాజెక్టులను పూర్తి స్థాయిలో పనిచేయించేందుకు అధికంగా బొగ్గు కావాల్సి వస్తోంది. దీంతో బొగ్గు కొరత ఏర్పడి అధిక ధరలకు విదేశాల నుండి దిగుమతి చేసుకోవడం తప్పనిసరి అవుతోంది. ఇందువల్ల విద్యుత్ ఉత్పత్తి సంస్థలు (జెన్‌కో)పై భారం పడుతుండగా, అదే స్థాయిలో విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కంలు) భరించాల్సి రావడంతో వాటిపై ఆర్థిక భారం పడుతోంది. ఈ విధంగానే గత వేసవి సీజనులో జూన్ 10వ తేదీన రికార్డు స్థాయిలో 211 గిగావాట్ల విద్యుత్ డిమాండ్‌కు దారితీసింది. వీటన్నింటి దృష్ట్యా బొగ్గు వినియోగాన్ని తగ్గించేందుకు పునరుత్పాదక ఇంధన వనరుల ద్వారా విద్యుత్ ఉత్పత్తిని పెంచేందుకు కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ వివిధ చర్యలు చేపట్టింది.

ఫలితంగా విద్యుత్ ఉత్పత్తి విషయంలో అత్యధికంగా వినియోగం జరుగుతున్న బొగ్గుకు రానున్న రోజుల్లో డిమాండ్ తగ్గనుంది. ఇందుకు ప్రధాన కారణం విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టులు పునరుత్పాదక ఇంధన వనరులు పెరుగదలేనని ఇంటర్నేషనల్ ఎనర్జీ ఏజెన్సీ (ఐఈఏ) అంచనా వేసింది. ఐఈఏ తాజాగా రూపొందించిన నివేదికలో ఈ విషయం స్పష్టం చేసినట్లు కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ సీనియర్ అధికారి ఒకరు వెల్లడించారు. విద్యుత్ ఉత్పత్తిలో పునరుత్పాదక ఇంధన వనరులు ప్రాముఖ్యతను సంతరించుకున్నందున బొగ్గు వినియోగ వాటా ప్రస్తుతం 74 శాతం ఉండగా 2025 సంవత్సరం నాటికి అది 69 శాతానికి తగ్గుతుందని నివేదికలో ఐఈఏ అంచనా వేసింది. పునరుత్పాదక ఇంధన వనరులకు సంబంధించిన వస్తువుల వాటా 25 శాతానికి చేరుకుంటుందని, దీని పర్యవసానంగా ఆ మేరకు బొగ్గు వినియోగం తగ్గుముఖం పడుతుంది. 2022 సంవత్సరంలో బొగు ఆధారిత ఉత్పత్తి 7.7 పెరిగిందని పేర్కొంది. దిగుమతి చేసుకున్న గ్యాస్ ధరల కారణంగా ఆ ఏడాది అంటే 2022లో గ్యాస్ ఆధారిత ఉత్పత్తి 36 శాతానికి పడిపోయిందని స్పష్టం చేసింది. అధిక బొగ్గు ఆధారిత ఉత్పత్తి కారణంగా కార్బన్ డై ఆక్సైడ్ తీవ్రత తగ్గినప్పటికీ, మొత్తం విద్యుత్ ఉత్పత్తి దాని ఉద్గారాలు 2025 సంవత్సరం నాటికి 8 శాతం పెరిగే అవకాశం ఉందని లెక్కకట్టింది. దేశ అణు విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంలో పెరుగుదలను కూడా ఐఈఏ అంచనా వేసింది. ఇందుకు అను ఉత్పత్తి 80 శాతానికి పైగా పెరిగి గంటకు 83 టెరావాట్ పెరుగుతుందని అంచనా వేసింది. కాగా 14 గిగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తున్న థర్మల్ ప్లాంట్ల 2017 నుండి 2022 మధ్య కాలం చెల్లి మూసివేయాల్సి ఉన్నా దేశ వ్యాప్తంగా విద్యుత్ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో వాటిని కొనసాగిస్తూ వస్తోంది. ఈ నేపథ్యంలో వీటికి ప్రత్యమ్నాయంగా పునరుత్పాదక ఇంధన సామర్థ్యం విస్తరణను వేగవంతం చేయడానికి విద్యుత్ మంత్రిత్వ శాఖ చర్యలు తీసుకుంటోందని ఆ శాఖకు చెందిన సీనియర్ అధికారి తెలిపారు. గ్రిడ్ విస్తరణ, అదనపు నిల్వ సమార్థ్యం కలిగి ఉన్న ట్రాన్స్‌మిషన్ గ్రిడ్‌లో ఈ అదనపు సామర్థ్యాన్ని ఏకీకృతం చేయడానికి ప్రభుత్వం ఒక ప్రణాళికను ఏర్పాటు చేసినట్లు వివరించారు. సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ (సిఈఏ) ప్రకారం 2030 నాటికి దాదాపు 3 గిగావాట్ల సామర్థ్యం కలిగిన థర్మల్ పవర్ ప్రాజెక్టులను మూసివేసి, దానికి సమానమైన పునరుత్పాదక ఇంధన సామర్థ్యం కలిగిన విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టులను ఏర్పాటు చేయడం ద్వారా ఆ మేరకు భర్తీ చేసేందుకు విద్యుత్ మంత్రిత్వ శాఖ ప్రణాళికా బద్ధంగా చర్యలు చేపట్టినట్లు అధికారవర్గాలు వెల్లడించాయి.

# జైలు నుంచి బెయిలుపై విడుదలైన నీహారిక

**హైదరాబాద్ (సైదాబాద్), మార్చి 19, ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నవీన్ హత్య కేసులో అరెస్టయి చంచల్‌గూడ మహిళా జైలులో ఉన్న నిహారిక బెయిలుపై ఆదివారం ఉదయం విడుదలైంది. ఇంజినీరింగ్ విద్యార్థి నవీన్‌ను అతని స్నేహితుడు హరిహరకృష్ణ అబ్దుల్లాపూర్‌మెట్ వద్ద అతికిరాతకంగా హత్య చేసి ముక్కలు ముక్కలుగా నరికి, అతడి గుండెతోపాటు ఇతర అవయవాలను బయటకుతీసి నిహారికకు వాట్సాప్‌లో పంపిన విషయాన్ని పోలీసులు తమ విచారణలో గుర్తించిన విషయం తెలిసిందే. ఈ కేసులో అరెస్టయి జైలులో ఉన్న ఆమెకు కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో జైలు నుంచి విడుదలైంది. ఈ కేసులో హరిహరకృష్ణ, హసన్, నిహారికలపై పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే.



# రాహుల్ నివాసానికి ఢిల్లీ పోలీసులు

లైంగిక దాడులు జరుగుతున్నాయన్న వ్యాఖ్యలపై వివరణ కోరామన్న పోలీసులు

అదానీ అంశం నుంచి దృష్టి మళ్లించేందుకేనని కాంగ్రెస్ మండిపాటు

**న్యూఢిల్లీ, మార్చి 19:** ఆదివారం ఢిల్లీ పోలీసులు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఇంటికి వెళ్లారు. మహిళలపై ఇంకా లైంగిక దాడులు జరుగుతున్నాయని ఆయన చేసిన వ్యాఖ్యలపై గతంలోనే పోలీసులు నోటీస్ జారీ చేశారు. ఇదే విషయంలో రాహుల్ నుంచి స్పష్టత కోసం ఆయన ఇంటికి వెళ్లినట్లు స్పెషల్ కమిషనర్ ఆఫ్ పోలీస్(శాంతి భద్రతలు) సాగర్‌ప్రీత్‌హుడా తెలిపారు. హుడా నేతృత్వంలోని పోలీసుల బృందమే ఆదివారం తుగ్లక్‌లేన్‌లోని రాహుల్ నివాసానికి వెళ్లింది. సోషల్ మీడియా పోస్టుల ఆధారంగా రాహుల్‌కు ఓ ప్రశ్నావళిని ఇచ్చినట్లు పోలీసులు తెలిపారు. లైంగిక దాడుల్ని ఎదుర్కొన్నామంటూ రాహుల్‌ని సంప్రదించిన మహిళలెవరో చెప్పాలని కోరామని పోలీసులు తెలిపారు. వివరాలు ఇస్తే..వారికి మరింత భద్రత కల్పిస్తామని చెప్పినట్లు తెలిపారు. రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్రలో భాగంగా శ్రీనగర్‌లో ఈ యేడాది జనవరి 30న మహిళలపై లైంగిక దాడుల గురించి ప్రస్తావించారు. యాత్రలో తనను కొందరు మహిళలు కలిశారని, ఇప్పటికీ తాము లైంగిక దాడులు ఎదుర్కొంటున్నామని చెప్పారని రాహుల్ అన్నారు. ఈ నేపథ్యంలో రాహుల్‌ను ఈ అంశంలో ఆశ్రయించిన మహిళల జాబితా ఇవ్వమని పోలీసులు కోరారు. తాను జరిపింది సుదీర్ఘమైన యాత్ర అయినందున అందుకు కొంత సమయం కావాలని రాహుల్ కోరారని, త్వరలోనే ఇస్తానని చెప్పారని హుడా పేర్కొన్నారు.

# పంజాబ్‌లో హైఅలర్ట్

అమృత్‌పాల్ కోసం ముమ్మర గాలింపు.. పరారీలో ఉన్న నేరస్థుడిగా ప్రకటించిన పోలీసులు



**చండీగఢ్, మార్చి 19:** ఖలిస్థాన్ సానుభూతిపరుడు, 'వారిస్ పంజాబ్‌దే' చీఫ్ అమృత్‌పాల్‌సింగ్‌ను పరారీలో ఉన్న నేరస్థుడిగా పంజాబ్ పోలీసులు ప్రకటించారు. అమృత్‌పాల్‌ను పట్టుకునేందుకు శనివారం నుంచి పోలీసులు తీవ్రంగా యత్నిస్తున్నారు. ఆదివారం అతణ్ని పట్టుకునేందుకు ఆయన పూర్వీకుల గ్రామం జల్లుఖేదాలో కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. హింసాత్మక ఘటనలు జరగకుండా పంజాబ్‌లోని పలు జిల్లాల్లో 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. పలుప్రాంతాల్లో ఇంటర్‌నెట్‌పై ఆంక్షలు విధించారు. రాష్ట్రంలోని రహదారులపై తనిఖీలను ముమ్మరం చేశారు. పొరుగున హిమాచల్‌ప్రదేశ్‌లోనూ హైఅలర్ట్ ప్రకటించారు. అమృత్‌పాల్‌ను పట్టుకునే వరకూ గాలింపు కొనసాగుతుందని పోలీస్ అధికారులు తెలిపారు. శనివారం పంజాబ్ పోలీసులు అమృత్‌పాల్‌ను పట్టుకునేందుకు భారీ ఆపరేషన్ చేపట్టగా, చిక్కినట్లే చిక్కి తప్పించుకున్నాడు. ఆ సమయంలో అమృత్‌పాల్ తన అనుచరులతో కలిసి మోటార్ సైకిల్‌పై పారిపోయినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అమృత్‌పాల్ ఎక్కడ ఉన్నాడన్నదానిపై కచ్చితమైన సమాచారం లేదని పోలీసులు తెలిపారు. అయితే, అనుమానిత ప్రాంతాలన్నిటిలో గాలింపును ముమ్మరం చేశామన్నారు. ఇప్పటివరకు అమృత్‌పాల్‌కు చెందిన 78మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారిలో అతని ఆర్థిక వ్యవహారాలు చూసే దల్జీత్‌సింగ్ కూడా ఉన్నాడు. అతణ్ని హర్యానాలోని గురుగావ్‌లో పట్టుకున్నారు. అమృత్‌పాల్‌కు అంగరక్షకులుగా పని చేస్తున్న ఏడుగురిని కూడా పోలీసులు పట్టుకున్నారు.

# సామాజిక న్యాయం కోసం పోరాడాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

**చర్ల, ప్రభాతవార్త :** భద్రాచలం డివిజన్‌లో నివసిస్తున్న గిరిజన ప్రజలకు ప్రథమ శత్రువు బిజెపి అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. ఆదివారం బస్టాండ్ సెంటర్‌లో సిపిఎం మండల కార్యదర్శి కారం నరేష్‌న అధ్యక్షనత జరిగిన జనచైతన్య యాత్ర భారీ బహిరంగ సబలో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని పాలనను ఎండగట్టారు. దశాబ్దాలుగా చెట్టూ పుట్ట కొట్టుకొని ఆ భూములనే నమ్ముకుని జీవనం సాగిస్తున్న గిరిజనులను భూమి కల్పించడంలోనూ జీవనోపాధి కల్పించడంలో కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆయన మండిపడ్డారు. ఆదివాసీ యువతకు కావాల్సిన విద్య అందించడంలో ప్రభుత్వం మీనమేషాలు లెక్కపెడుతుందని విమర్శించారు.

**బిజెపి ప్రభుత్వానికి బుద్ధి చెప్పే వరకు విశ్రమించేది లేదు: పోతినేని, మచ్చా**

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దెదించేంతవరకు విశ్రమించేదిలేదని సిపిఎం రాష్ట్ర నాయకులు పొతినేని సుదర్శన్, మచ్చా వెంకటేశ్వర్లు అన్నారు. సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన జనచైతన్య యాత్ర ద్వారా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడతామని అన్నారు. జనచైతన్య యాత్ర రథసారధి అఖిలభారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్ట్ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు జనచైతన్య యాత్ర ఈనెల 17న వరంగల్‌లో పార్టీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి ప్రారంభించారని, ఈ యాత్ర హన్మకొండ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్, భూపాలపల్లి, భద్రాద్రికొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, రంగారెడ్డి జిల్లాల మీదుగా ప్రయాణించి 29న హైదరాబాదులో ముగింపు సభ జరుగుతుందని ఈ సభకు మేధావులు, విద్యావేత్తలు, యువత, ఆయా ప్రాంతాల్లో జరిగే బహిరంగ సభలను విజయవంతం చేయాలని అన్నారు.

# 200 కిలోల గంజాయి స్వాధీనం

- నార్కోటిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు చిక్కిన అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లింగ్ ముఠా

**హైదరాబాద్, మార్చి 19, ప్రభాతవార్త:** హైదరాబాద్ నార్కోటిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ పోలీసులకు మరో అంతర్రాష్ట్ర గంజాయి ముఠా పట్టుబడింది. ఈ సందర్భంగా నేరగాళ్ల నుంచి 200 కిలోల నాణ్యమైన గంజాయితో పాటు ఒక డిసిఎం వాహనం, మూడు సెల్‌ఫోన్లను జప్తు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను టాస్క్‌ఫోర్స్ డిసిపి గుమ్మి చక్రవర్తి ఆదివారం మీడియాకు వెల్లడించారు. ఎపిలోని తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రికి చెందిన శ్రీనివాసరావు (48) స్థానికంగా డ్రైవర్‌గా పనిచేయ సాగాడు. ఇతని వద్ద రాజమండ్రి విఎల్ పురం నివాసి సత్తిబాబు (29) అనే వ్యక్తి క్లీనర్‌గా వున్నాడు. శ్రీనివాసరావు, సత్తిబాబు తమ సంపాదన పట్ల కొంతకాలంగా అసంతృప్తిగా వున్న వేళ వైజాగ్‌లోని సీలేరుకు చెందిన పాండు, నాగేష్ అనే ఇద్దరు గంజాయి స్మగ్లర్లు పరిచయం అయ్యారు. తమతో కలిసి డిసిఎం వాహనంలో హై దరాబాద్‌కు గంజాయి స్మగ్లింగ్ చేస్తే ఒక ట్రిప్‌కు లక్షా 20 వేల రూపాయలు ఇస్తామని పాండు, నాగేష్‌లు ఆశచూపారు. పాండు, నాగేష్‌ల ఆఫర్‌ను శ్రీనివాసరావు, సత్తిబాబు కాదనలేక పోయారు. దీని తరువాత శ్రీనివాసరావు తాను డ్రైవర్‌గా వున్న డిసిఎం వాహనం క్యాబిన్‌లో చిన్నపాటి మార్పులు చేసి, సీటు కింద రెండు వం దల కిలోల గంజాయి వుంచేలా ఏర్పాట్లు చేశాడు. అనంతరం పాండు, నాగేష్‌లు ఇచ్చిన 200 కిలోల గంజాయిని రాజమండ్రి నుంచి హైదరాబాద్‌కు తీసుకువచ్చారు. ఈ గంజాయిని హైదరాబాద్‌లోని ఆసిఫ్‌నగర్‌కు చెందిన పర్వేజ్, చాంద్రాయణగుట్టకు చెందిన జావెద్‌లకు శ్రీనివాసరావు అప్పగించాల్సి వుంది. ఇలా పాండు, నాగేష్ లు ఇచ్చిన 200 కిలోల గంజాయిని డిసిఎం వ్యాన్‌లో వుంచి ఆదివారం ఉదయం నగరంలోని లంగర్‌హౌస్ వద్దకు వచ్చిన శ్రీనివాసరావు, సత్తిబాబుల గురించి నా ర్కోటిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ పోలీసులకు ముందుగానే సమాచారం అందింది. దీంతో ఈ విభాగం పోలీసులు లంగర్‌హౌజ్ వద్ద ఆదివారం ఉదయం కాపుకాయగా శ్రీనివాసరావు, సత్తిబాబులు 200 కిలోల గంజాయితో డిసిఎం వ్యాన్‌లో వస్తూ దొరికిపోయారు. వీరితో పాటు నగరంలోని గంజాయి స్మగ్లర్ మహమ్మద్ హబీబ్ (35) (ఇతను రాజేంద్రనగర్ వాసి) కూడా దొరికిపోయాడు. పట్టుబడ్డ స్మగ్లర్లను విచారించగా శ్రీనివాసరావు, సత్తిబాబులు గంజాయిని హైదరాబాద్ వరకు స్మగ్లింగ్ చేయడం వరకే పరిమితమని, ఆ తరువాత దీనిని మహారాష్ట్రలోని ఉస్మానాబాద్‌కు తరలించడం మరో ముఠా చూసుకుంటుందని తేలింది. ఈ ముఠాలో హైదరాబాద్‌కు చెందిన పర్వేజ్, జావెద్‌లతో పాటు మహారాష్ట్రలోని ఉస్మానాబాద్‌కు చెందిన మంగేష్ కూడా వున్నట్లు తేలింది. కాగా శ్రీనివాసరావు, సత్తిబాబులు మొదటిసారి గంజాయి స్మ గ్లింగ్ చేశారా...? ఇంతకు ముందు ఏమైనా ఈ తరహా నేరాలకు పాల్పడ్డారా...? అనే దానిపై పోలీసులు విచారణ చేస్తున్నారు. కాగా 200 కిలోల గంజాయితో పట్టు బడ్డ శ్రీనివాసరావు, సత్తిబాబు, హబీబ్‌లను తదుపరి విచారణ నిమిత్తం లంగర్ హౌజ్ పోలీసులకు అప్పగించారు. వీరి వద్ద నుంచి మూడు సెల్‌ఫోన్లను, డిసిఎం వాహ నాన్ని జప్తు చేశారు. ఈ కేసులో హైదరాబాద్‌కు గంజాయి స్మగ్లర్లు చెందిన పర్వేజ్, జావెద్‌లతో పాటు మహారాష్ట్రలోని ఉస్మానాబాద్‌కు చెందిన మరో స్మగ్లర్ మంగే ష్, ఎపిలోని సీలేరు చెందిన స్మగ్లర్లు పాండు, నాగేష్‌ల కోసం గాలిస్తు న్నారు. నార్కోటిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ ఇన్‌స్పెక్టర్ రాజేష్ నేతృత్వం లోని పోలీసు బృందం ఈ ముఠాను పట్టుకుంది.



నార్కోటిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు చిక్కిన అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లింగ్ ముఠా

# అదానీ వ్యవహారాన్ని పక్కకు నెట్టేందుకు రాహుల్‌గాంధీకి నోటీసులు

మాజీ మంత్రి పొన్నాల

**హైదరాబాద్, మార్చి 19, ప్రభాతవార్త:** ఆదానీ వ్యవహారాన్ని పక్కకు నెట్టేందుకు రాహుల్‌గాంధీకి నోటీసులు ఇచ్చారని మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య అన్నారు. ఆదివారం జూబ్లిహిల్స్‌లోని తన నివాసంలో మీడియాతో మాట్లా డారు. రాహుల్‌గాంధీ ఢిల్లీ పోలీసులతో కేంద్రం నోటీసులు ఇప్పించడం దారుణమన్నారు. అలాంటి నోటీసులకు కాంగ్రెస్ భయపడదన్నారు. మోడీ, కేడీలకు రాహుల్ గాంధీ భయపడుతారని అనుకుంటున్నారా అంటూ ప్రశ్నించారు. స్వాతంత్ర్యం కోసం ఎన్ని ఇబ్బందులైనా పోరాటం చేసిన పార్టీ కాంగ్రెస్ పార్టీ కాదా అన్నారు. కశ్మీర్‌లో జరిగిన జోడో యాత్రంలో రాహుల్‌గాంధీని కలిసిన కొందరు మహిళలు తాము లైంగిక వేధింపులకు గురైనట్లు చెప్పారని, పోలీసు కేసు పెట్టారని అప్పుడే రాహుల్ గాంధీ సూచించారన్నారు.

సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్
ఆపరేషన్ : సిద్దిపేట సర్కిల్
టెండరు ప్రకటన
సిద్దిపేట సర్కిల్‌లో వివిధ విద్యుత్ మరియు సివిల్ పనులకు SE/OP/సిద్దిపేట యొక్క T-102, T-108 & T-112/22-23 (విస్తరించబడిన) & T-115 & T-127/2022-23 (కొత్త) మరియు టెండర్ స్పెసిఫికేషన్ నెం. T-97/22-23 (ఓపెన్‌కు మార్చబడినది) కొరకు టెండర్ ప్రకటన. బహిరంగ టెండర్లకు, బిడ్స్ విక్రయం 20.03.2023 నుండి ప్రారంభమై, 28.03.2023 సా.17.00గం. వద్ద ముగింపు. బిడ్స్ దాఖలుకు చివరి తేది: 29.03.2023 మ.14.00గం. వద్ద. మరియు 29.03.2023 సా.16.00గం.లకు తెరువబడును. టెండర్ వివరాలు www.tssouthernpower.com లో చూడవచ్చును. ఫోన్ నం: 7382943946.
సం/-. సూపరింటెండింగ్ ఇంజనీర్, ఆపరేషన్ సర్కిల్: సిద్దిపేట, TSSPDCL.
DIPR.No.13445-PP/CL/Advt/1/2022-23 తేదీ: 18.03.2023

డైరెక్టరేట్ జనరల్ రీసెటిల్‌మెంట్
రక్షణ మంత్రిత్వశాఖ
ఉద్యోగాలు కావలసిన వారిని, ఉద్యోగాలు ఇచ్చేవారిని కలిపి ఒకే వేదికపైకి తెస్తోంది.
హైదరాబాద్ వద్ద
DGR యొక్క మాజీ సైనికులకు ఉద్యోగ ప్రదర్శన
మాజీ సైనికోద్యోగులకు ఉద్యోగాలకు రెండవ ఇన్నింగ్స్ కొరకు
28 మార్చి 2023న STN స్పోర్ట్స్ గ్రౌండ్స్, AFS హకీంపేట, రిసాలాబజార్, బొల్లారం, సికింద్రాబాద్, తెలంగాణ-500014
సమయం: ఉ॥08.00 గం॥ ఆపైన
సమావేశ స్థలం వద్ద మాజీ సైనికోద్యోగులు అందరికీ రిజిస్ట్రేషన్ చేయబడుతుంది.
➢ తెచ్చుకోవలసిన డాక్యుమెంట్లు: ESMలు, ESMI కార్డు మరియు తాజా CV/ బయోడేటా యొక్క అయిదు కాపీలు, ఫోటోగ్రాఫ్‌తో సహా తెచ్చుకోవాలి.
➢ ESM కు డ్రెస్: ఓపెన్ కాలర్/మఫ్టీ
➢ ముందుగా వచ్చినవారికి ముందు సేవ అందించే బేసిస్‌పై ఎంట్రీ
ESM ఉద్యోగ అన్వేషకులకు ప్రయోజనాలు
పలు రకాల ఉద్యోగ అవకాశాలకు ఖరీదు లేకుండా ఉచిత సౌలభ్యం
కష్ట క్లిష్టత లేని నియామకాల విధానం
టాప్ PSUలు/ కార్పొరేట్‌ల రిక్రూటర్‌లతో అనుసంధానం.
తదుపరి సందేహాలు మరియు సహాయానికి దయచేసి జాయింట్ డైరెక్టర్ (SE &CI) డైరెక్టరేట్ జనరల్ రీసెటిల్‌మెంట్
వెస్ట్ బ్లాక్ VI, ఆర్.కె.పురం, న్యూఢిల్లీ-110066
ఇ.మెయిల్:seopadgr@desw.gov.in
టెలిఫోన్: +91 1120862542 వెబ్‌సైట్:http://www.dgrindia.gov.in సంప్రదించండి.
CBC-10401/11/0002/2223

# తెలంగాణలో అతిపెద్ద స్కాం మిషన్ భగీరథ

- 'దళితబంధు'లోనూ కమీషన్ల పర్వం
- ఖానాపూర్ ఎమ్మెల్యే కమీషన్ లేనిదే కొబ్బరికాయ కొట్టడు
- ప్రభుత్వం దోపిడీ పాలన సాగిస్తోంది: పిసిసి చీఫ్ రేవంత్



పాదయాత్రలో పాల్గొన్న భట్టి విక్రమార్క తదితరులు

**ఉమ్మడి అదిలాబాద్ బ్యూరో, ప్రభాతవార్త:** భట్టి విక్రమార్క పాదయాత్ర వాడి, వేడిగా సాగింది ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ అదిలాబాద్ జిల్లా ఖానాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ శ్రేణుల మధ్య మధ్య, ప్రజాసమస్యలను వింటూనే అడవి బిడ్డల గురించి ప్రజల్లో చైతన్యాన్ని కలిగించే దిశగా సాగింది. భట్టి విక్రమార్క పాదయాత్ర నాలుగవ రోజు వాడి వేడిగా సాగింది. ఆదిలాబాద్ జిల్లా, ఖానాపూర్ నియోజకవర్గంలో జనం ఎన్నో సమస్యలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. భట్టి మాట్లాడుతూ విద్వేషాలతో దేశాన్ని విడగొట్టతున్న బిజెపి అని దేశ సంపదను కొంత మందికే పంచుతున్నారు. మోడి పాలనలో ఆర్థికంగా ఉన్నవారు.. లేని వారనే అసమానతలు పెరిగాయి ఆర్థిక అసమానతలతో దేశాన్ని రెండుగా చీలుస్తున్న బిజెపి దేశాన్ని విచ్చిన్నం చేస్తున్న బిజేపి నుంచి జాతిని ఏకం చేయడానికి రాహుల్ గాంధీ భారత్ జోడో చేశారు. భారత్ జోడో కొనసాగింపుగానే హాథ్ సే హాథ్ పాదయాత్ర.ఏఐసిసి ఆదేశాలతో రాష్ట్ర కాంగ్రెస్ పక్షాన రాష్ట్రంలో ఒక పక్కన పిసిసి అధ్యక్షులు రేవంత్, ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు నేను ఈ పాదయాత్ర చేస్తున్నాం.తెలంగాణ లక్ష్యాన్ని చేరుకోకుండా, అడ్డుకుంటున్న ప్రభుత్వానికి బుద్ధి చెప్పుదాము..పోడు భూములకు పట్టాలు వస్తాయని ఆశ పడ్డాం..చివరకు అడవుల్లోకి రానియ్యాడం లేదు.అడవి సంపదకు దూరం చేయడమే కాదు వారిని బయటకు పంపిస్తున్నారు. అటవీ సంపద అంతా వారిదే..వద్దనడానికి నువ్వెవరు. బ్రిటిష్ ప్రభుత్వం తరహాలోనే బిఆర్ఎస్ ప్రభుత్వం ఆదివాసిల విషయంలో అలాగె చేస్తుంది. జన్నారంలో చేపల వేటకు కేసులు పెట్టారు. ఇది ఫ్రెంచ్, పోర్చు గ్రీసు, బ్రిటీష్ ప్రభుత్వమా.. వేరే దేశం ప్రభుత్వం అన్నట్టుగా దుర్మార్గంగా వ్యవహరిస్తున్న బిఆర్ఎస్ ప్రభుత్వం మూడేళ్ళుగా కుండలు చేసుకోవడానికి అడవి నుంచి మట్టి కూడా తీసుకొనివ్వడం లేదు. కట్టేలు తెచ్చుకొనివ్వడం లేదు. సాగు నీళ్ల ఇవ్వరు. బొర్లు వేసుకొనివ్వరు. అడవి నుంచి గిరిజనులను ఖాళీ చేయించే అతిపెద్ద కుట్ర చేస్తున్న బిఆర్ఎస్. ఆదివాసుల హక్కుల కోసం కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుంది. వారికి అండగా నిలబడుతుంది.

**బిఆర్ఎస్ పాలనలో నిర్వీర్యం అవుతున్న ఐటిడిఎ**

గిరిజనుల సంక్షేమ పథకాలకు కోతపెట్టిన ప్రభుత్వం. ఇంటింటికి నీరు అందించే మిషన్ భగీరథ పథకానికి 42వేల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టాం అని చెప్పారు. ప్రతి ఇంటికి నీరు రావడం లేదు. దస్నాపూర్ అందుగూడలో చేద బావులు దిక్కు అయ్యాయి. ట్యాంక్‌లు కట్టి బిల్లులు తీసుకున్నారు. అతి పెద్ద స్కాం మిషన్ భగీరథ అని, పేపర్ లీకేజీతో నిరుద్యోగుల ఆశలను నిండా ముంచిన ప్రభుత్వం, టీఎస్పీఎస్పీ బోర్డు చైర్మన్ సభ్యులను సెక్రటరీని వెంటనే తొలగించాలి. టిఎస్‌పిఎస్‌సి బోర్డును నియమించిందేవరో వారు నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలి. కాంగ్రెస్ హయంలో రైలు ప్రమాదం జరిగితే కేంద్రంలో ఉన్న రైల్వే మంత్రి నైతిక బాధ్యతగా రాజీనామా చేశారు. పేపర్ లీకేజీ తమకు సంబంధం లేదని అంటే ఎట్లా ఎవరికి సంబంధం ఇన్నాళ్లు నిరుద్యోగులు పోటీ పరీక్షల కోసం పెట్టిన ఖర్చు తిరిగి ఇవ్వాలన్నారు.

**లిక్కర్ స్కాంతో తెలంగాణకు తలవంపులు తెచ్చిన ఎమ్మెల్సీ కవిత**

క్రేజీవాల్ నుంచి కవిత వరకు అందరిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని, అభినవ గాంధీ అని టోపిలు పెట్టుకొని అవినీతిని ఊడ్చివేస్తానన్న కేజ్రీవాల్ లిక్కర్ స్కామ్‌కు పాల్పడిన అంశంపై అన్న హాజరే బయటకు వచ్చి స్పందించాలి అన్నారు. ఖానాపూర్‌లో ఎమ్మెల్యే కమిషన్ లేకుంటే కొబ్బరి కాయ కొట్టరటా అని దళిత బంధు, ట్రాక్టర్ ఇవ్వడానికి, ఏ పనికైనా కమిషన్ అడుగుతున్నారని సొంత పార్టీ నేతలే చెపుతున్నారన్నారు.

# 'తెలంగాణ మిల్లెట్ మ్యాన్' పివి సతీష్ ఇకలేరు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 18:** తెలంగాణ మిల్లెట్ మ్యాన్ పీవీ సతీష్(77) తుదిశ్వాస విడిచారు. కొన్ని సంవత్సరాలుగా మూత్ర పిండాల సమస్యతో బాధపడుతున్న పీవీ సతీష్(పెరియపట్న వెంకటసుబ్బయ్య)... ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం కన్నుమూశారు. సేంద్రీయ వ్యవసాయం, చిరుధాన్యాల సాగు కోసం 4 దశాబ్దాలుగా కృషి చేసినందుకు గానూ ఆయనకు మిల్లెట్ మ్యాన్‌గా పిలుస్తారు. 1945 జూన్ 18న కర్ణాటకలో జన్మించిన పీవీ సతీష్... జర్నలిస్టుగా తన కెరీర్‌ను ప్రారంభించారు. ఉద్యోగ రీత్యా హైదరాబాద్‌లోని దూరదర్శన్‌లో డైరెక్టర్‌గా పనిచేశారు. అనంతరం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ కేంద్రంగా దక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ స్థాపించారు. జహీరాబాద్ ప్రాంతంలో దళిత మహిళా సాధికారతకు పీవీ సతీశ్ కుమార్ విశేషంగా కృషి చేశారు. పస్తాపూర్ కేంద్రంగా 75 గ్రామాల్లో ఎందరికో ఆయన అండగా నిలిచారు. చిరుధాన్యాల సాగు విస్తీర్ణాన్ని పెంచడం, అడవుల పరిరక్షణ, సేంద్రీయ వ్యవసాయం, విద్యా నైపుణ్యాలను మెరుగుపర్చడం తదితర అంశాలపై అవిరళ కృషి చేశారు. అలాగే,వాతావరణ మార్పుల నేపథ్యంలో రసాయన ఎరువుల,క్రిమి సంహారక మందులకు ప్రత్యామ్నాయంగా... సహజ వ్యవసాయ పద్దతులను ప్రోత్సహిస్తూ పెద్ద ఎత్తున రైతుల్లో అవగాహన కల్పించారు. అంతేగాక, హైదరాబాద్–ముంబై జాతీయ రహదారిపై తొలి మిల్లెట్స్ కేఫ్ ఏర్పాటుకు తన వంతు కృషి చేశారు. 30 సంవత్సరాల కిందట మొదటిసారిగా ప్రపంచవ్యాప్త చర్చలో.. చిరుధాన్యాలను ప్రవేశపెట్టడంలో సఫలీకృతమయ్యారు. సేంద్రీయ వ్యవసాయం,చిరుధాన్యాల సాగు కోసం 4 దశాబ్దాలుగా కృషి చేశారు. ప్రత్యేకించి చిన్న కమతాల్లో పెట్టుబడి లేకుండా... చిరుధాన్యాల పంటల సాటు,విస్తీర్ణం,వినియోగం పెంపు కోసం కృషి చేశారు. ప్రభుత్వ పంపిణీ వ్యవస్థలో చిరుధాన్యాలను చేర్చడంలో 2018 సంవత్సరాన్ని కేంద్రం జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. వీరి కృషికి అనేక జాతీయ,అంతర్జాతీయ అవార్డులు లభించాయి. ఇక,సతీష్ మృతిపట్ల ప్రముఖులు సంతాపం తెలిపారు. ఆయన అంత్యక్రియలు సోమవారం జహీరాబాద్‌లో జరగనున్నాయి. పీవీ సతీశ్ మృతి పట్ల వివిధ రాజకీయ పార్టీల నేతలు,అధికారులు సంతాపం తెలిపారు.

**సతీశ్ మరణ వార్త షాక్‌కు గురిచేసింది: మంత్రి హరీశ్‌రావు**

దక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ వ్యవస్థాపకులు పీవీ సతీశ్ మరణం పట్ల మంత్రి హరీశ్‌రావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. సతీశ్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. జహీరాబాద్ ప్రాంతంలో 40 ఏళ్లుగా సామాజిక సేవ చేస్తూ మిల్లెట్స్ సేంద్రీయ వ్యవసాయంలో రైతులకు,ముఖ్యంగా వెనుకబడిన మహిళలకు శిక్షణ ఇస్తూ మహిళా సాధికారత కోసం కృషి చేసిన గొప్ప మానవతావాది అని హరీశ్‌రావు ట్విట్టలో పేర్కొన్నారు.

# రాష్ట్రంలో మరో రెండు రోజులపాటు వర్షాలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 18:** తెలంగాణలో మరో రెండు రోజుల పాటు అక్కడకక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. శనివారం ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రస్తుతం దక్షిణ అంతర్గత కర్ణాటక నుంచి పశ్చిమ విదర్భ వరక ఉత్తర అంతర్గత కర్ణాటక, మరఠ్వాడా మీదుగా సముద్ర మట్టానికి 0.9 కి.మీ ఎత్తులో కొనసాగుతోంది. దీని ప్రభావంతో ఆదివారంనాడు రాష్ట్రంలో చాలా చోట్ల ఉరుములు,మెరుపులు, ఊదరుగాలులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది.

# పేపర్ లీకేజీపై సిబిఐతో విచారణ జరిపించాలి: ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 18:** టిఎస్‌పిఎస్సీ పేపర్ లీకేజీ తెలంగాణ సమాజాన్ని అతలాకుతలం చేస్తున్న అంశమని బిఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మార్చి 11న జరిగిన పేపర్ లీకేజీని టిఎస్‌పిఎస్సీ చిన్న విషయంగా చూపించే ప్రయత్నం చేసిందని తెలిపారు. ఈ పేపర్ లీకేజీలో సిఎం కెసిఆర్ కుటంబానికి సంబంధం ఉందని ఆరోపించారు. 30లక్షల విద్యార్థుల భవిష్యత్తును చిన్న విషయంగా చూపించే ప్రయత్నం చేస్తున్నారని మంత్రి కెటిఆర్‌పై మండిపడ్డారు. టిఎస్‌పిఎస్సీ పేపర్ లీకేజీపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కల్వకుంట్ల కవితకు సంబంధించిన జాగృతి సభ్యులకు పేపర్ లీక్‌లో సంబంధం ఉన్నట్లు తెలుస్తోందన్నారు. పేపర్ లీక్ అంశాన్ని సిబిఐతో విచారణ చేయించాలని ఆయన డిమాండ్ చేశారు. టిఎస్‌పిఎస్సీపై కనీస అవగాహన లేకుండా కెటిఆర్ మాట్లాడారని, టిఎస్‌పిఎస్సీ చైర్మన్ జనార్ధన్‌రెడ్డి పేరు కూడా నిందితుల జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. సెక్షన్ 60 కింద జనార్ధన్‌పై కేసు పెట్టాలని పేర్కొన్నారు. చైర్మన్‌గా ఉన్న జనార్ధన్‌రెడ్డి రాజీనామా చేయాలని,ఆయనపై వ్యక్తిగతంగా తనకు దురుద్దేశం లేదని పేర్కొన్నారు.



డాక్టర్ దేవులపల్లి పద్మజకు కర్ణాటక తెలుగురచయితల సమాఖ్య 'ఉగాది జాతీయ సాహిత్య పురస్కారం' అందజేస్తున్న దృశ్యం

# డాక్టర్ దేవులపల్లి పద్మజకు ఉగాది జాతీయ సాహిత్య పురస్కారం

**విజయవాడ,మార్చి19,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రఖ్యాత రచయిత్రి, సాహితీ,విద్యావేత్త డాక్టర్ దేవులపల్లి పద్మజకు కర్ణాటక తెలుగురచయితల సమాఖ్య "ఉగాది జాతీయ సాహిత్య పురస్కారం-2023"ను అందజేసారు. బెంగుళూరు లోని కర్ణాటక తెలుగురచయితల సమాఖ్య ఆది వారం ఇండో ఏషియన్ అకాడమీ విద్యాసంస్థలు, డీఆర్ అకాడమీ వేదికా శోభకృత్ నామ సంవత్సర ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ దేవులపల్లి పద్మజ సిబిఐ మాజీ జెడి లక్ష్మీనారాయణ ద్వారా ఉగాది పురస్కా రాన్ని ప్రధానం చేసారు.

తెలుగు సాహిత్యానికి విశేషసేవలు చేసిన డాక్టర్ దేవులపల్లి పద్మజను గుర్తించిన కర్ణాటక తెలుగురచయితల సమాఖ్య ఆమె ఈ అరుదైన గౌరవం అందజేసింది.కర్ణాటక తెలుగు రచయితల సమాఖ్య చైర్మన్ డాక్టర్ మల్యాధి, కార్యదరి,అధ్యక్షులు, కుటుంబసభ్యులు విన్‌కమాండర్ సత్యకుమార్, శ్రీనివాసరావు, భాస్కరరామశర్మలు డాక్టర్ పద్మజకు అభినందనలు తెలిపారు.అవార్డు గ్రహీత పద్మజ విశాఖపట్టణం కేంద్రంగా తన సాహిత్యసేవలు అందిస్తున్నారు. తనకు అవార్డులు అందించిన నిర్వాహకులు కళ్లే శాస్త్రి, మల్యాది,సంజీవ్‌లకు పద్మజ కృతజ్ఞతలు తెలిపారు.

# రాష్ట్రంలో అకాల వర్షాల కారణంగా తీవ్ర పంట నష్టం

- రైతులను ఆదుకోవాలంటూ సిఎం కెసిఆర్‌కు పిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి బహిరంగ లేఖ



**హైదరాబాద్, మార్చి 19, ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా గత నాలుగు రోజుల నుంచి కురుస్తున్న అకాల వర్షాలతో రైతుల పరిస్థితి దయనీయంగా తయారైందని, ఓవైపు వ్యవసాయ పెట్టుబడులు భారీగా పెరిగిపోయాయని ప్రభుత్వాల నుంచి సహాయం అందక ఇబ్బందులు పడుతున్నారని టిపిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి అన్నారు. రైతులను ఆదుకోవాలంటూ సిఎం కెసిఆర్‌కు బహిరంగ లేఖ రాసారు. కాల వర్షం సృష్టించిన భీభత్సం మూలిగే నక్కపై తాడిపండు పడిన చందంగా మారిందన్నారు. వందల కోట్ల రూపాయలు పెట్టుబడి వరద పాలైన పరిస్థితి కళ్లముందు కనిపిస్తుంటే దీనంగా రోధిస్తూ భరించాల్సిన దుస్థితి రైతులకు దాపురించిందన్నారు. పొట్టదశలో ఉన్న వరి సహా ఇతర పంటలు కోసి ఆరబెట్ని పంటలు ధ్వంసం అవుతుండడంతో ఆరుగాలం పడిన శ్రమ బూడితలో పోసినట్లైయిందన్నారు. రైతులను పట్టించుకోకుండా రాజకీయాలు చేలగాటం ఆడుతున్నారన్నారు. పంట నష్టంపై ప్రభుత్వం నుంచి గానీ, వ్యవసాయం విభాగం నుంచి గానీ ఎటువంటి ప్రకటన రాకపోవడం రైతుల్లో ఆందోలన కలిగిస్తుందన్నారు. అకాల వర్షాలకు వికారాబాద్, భద్రాద్రి, ములుగు, భూపాలపల్లి, సంగారెడ్డి, నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం, రంగారెడ్డి జిల్లాలో రూ.100కోట్లకు పైగా పంట నష్టం జరిగిందన్నారు. సంగారెడ్డి జిల్లాలో 62 గ్రామాలలో 2633 ఎకరాల్లో మొక్కజొన్న, జొన్న, మామిడి, ఉల్లి, టమాట, పుచ్చపంటలు నష్టపోయాయన్నారు. చాలా జిల్లాలో పరిస్థితి దారుణంగా ఉందన్నారు. గతంలో ఇలాంటి విపత్తుల సమయంలో రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్ర బృందాలను రప్పించి, క్షేత్రస్థాయిలో పంట నష్టం అంచనా వేయించి, రైతులకు పరిహారం అందేలాచర్యలు తీసుకునేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా వరదలు, అకాల వర్షాలకు పంట నష్టం జరగడం పరిహారం అందక ఉసూరుమనడం రైతాంగానికి పరిపాటిగా మారిందన్నారు. ప్రకృతి విపత్తులు, భారీ వర్షాలతో పంటలు దెబతిని రైతులు కుదేలవుతుంటే వారిని ఆదుకునే పథకం ఏదీ కూడా ప్రభుత్వం వద్ద లేకపోవడం అత్యంత దారుణమైన విషయం అన్నారు. ఇది రైతుల పట్ల మీ కపట ప్రేమకు ఇది నిదర్శనం అన్నారు. ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన పథకాన్ని అమలు చేయని రాష్ట్రాలు ప్రత్యామ్యాయ భీమా పథకం ద్వారా రైతులను ఆదుకుంటున్నాయన్నారు. అటువంటి వ్యవస్థ కూడా ఈ రాష్ట్రంలో లేకపోవడం దురదృష్టకరం అన్నారు.

ప్రభుత్వాల చేయూత లేకుండా రైతులు స్వయంగా పంటల భీమా తీసుకునే పరిస్థితి లేకపోవటంతో ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు భారీ నష్టాలను చవిచూడాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత సీజన్‌లో నష్టపోయిన రైతులకు భరోసా కల్పించే విధంగా తగిన నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. తక్షణమే పంట నష్టాన్ని అంచనా వేయడం, ఎకరాకు రూ.15వేల చొప్పున నష్టపరిహారం, తదుపరి పంటల నుంచి ప్రభుత్వ ప్రీమియం చెలనఇలంచి పంటల భీమా పథకాన్ని అమలు చేసేందుకు తక్షణం చర్యలు తీసుకోవాలని, తక్షణం రూ.1లక్ష రూపాయల రుణమాఫీ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# 2 రోజుల్లో ప్రభుత్వం స్పందించకుంటే నిరాహార దీక్ష చేస్తా

**రైతులను ఆదుకోవాలని కోరుతూ సిఎం కెసిఆర్‌కు కోమటిరెడ్డి లేఖ**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 18:** అకాల వర్షాలు,వడగళ్ల వానతో తీవ్రంగా నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ భువనగిరి కాంగ్రెస్ ఎంపీ కోమిటిరెడ్డి వెంకటరెడ్డి సిఎం కెసిఆర్‌కు లేఖ రాశారు. రైతుల సమస్యలపై రెండు రోజుల్లో ప్రభుత్వం స్పందించకుంటే 22న తిరుమలగిరి మండలంలో నిరాహార దీక్షకు కూర్చొంటానని హెచ్చరించారు. అకాల వర్షం,వడగళ్ల వాన అన్నదాతల ఆశలను చిదిమేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. అరుగాలం కష్టపడి పండించిన పంట చేతికొచ్చే సమయానికి వడగండ్ల వానతో అన్నదాత తీవ్రంగా నష్టపోయారన్నారు. దీక్కుతోచని స్థితిలో రైతన్నలు కొట్టుమిట్టాడుతున్నారని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో పాలకులు పట్టించుకోకపోవడం దుర్మార్గమన్న కోమటిరెడ్డి...రెండు రోజుల్లో ప్రభుత్వం స్పందించకుంటే రైతుల పక్షాన తానే స్వయంగా రంగంలోకి దిగుతానని స్పష్టం చేశారు. అకాల వర్షానికి నష్టపోయిన ప్రతీ రైతుకు పరిహారం అందించేందుకు తన పోరాటం ఆగదని వెల్లడించారు. తక్షణమే పంట నష్టం అంచాన వేసి రైతులను ఆదుకునే ప్రక్రియ మొదలు పెట్టాలని డిమాండ్ చేశారు. అకాల వర్షంతో భువనగిరి పార్లమెంట్ పరిధిలోని తిరుమలగిరి మండలంలో 99శాతం పంటలు దెబ్బతిన్నాయని, వరి,మిరప,టమాట,మొక్కజొన్న,ఇతర పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు.

# టిఎస్‌పిఎస్సీ పేపర్ లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

పిసిసి సీనియర్ ఉపాధ్యక్షుడు నిరంజన్

**హైదరాబాద్, మార్చి 19 ప్రభాతవార్త:** టిఎస్‌పిఎస్‌సి పేపర్ లీకేజీ విషయంలో సిట్టింగ్ జడ్జి పర్యవేక్షణలో విచారణ జరిపించాలని టిపిసిసి సీనియర్ ఉపాధ్యక్షులు నిరంజన్ అన్నారు. పరీక్షలు సైతం సిట్టింగ్ జడ్జి పర్యవేక్షణలో పరీక్షలు జరగాలన్నారు. ఆదివారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారంపై పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్‌తో ఇతర అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన తరువాత సిఎం కెసిఆర్ మీడియా సమావేశం నిర్వహించిన పరీక్షల రద్దుతో నష్టపోతున్న అభ్యర్థులకు భరోసా ఎందుకు కల్పించలేదన్నారు.ముఖ్యమంత్రి దిద్దుబాటు చర్యలను వివరించి హామి ఇస్తే అది అభ్యర్తులకు ఉపశమనం కలిగించేదన్నారు. రాజకీయాలపై ఉన్న పట్టింపు, ప్రభుత్వం తప్పిదాలతో మానసిక ఆందోళనకు గురై నష్టపోతున్న ప్రజలపై ఉండదా అన్నారు. మంత్రి కెటిఆర్‌కు క్లీన్ చీట్ ఇచ్చారంటూ ఏదో గూడు పుఠాని ఉందని అనిపిస్తున్నారు. కేబినెట్ మీటింగ్‌లో సిఎం పక్కన్న ఉన్న సిఎస్, మీడియా సమావేశంలో సిఎస్ ఎక్కడ ఉన్నారన్నారు. సిఎస్ పదవి హుందాతనాన్ని దిగజారుస్తున్నారన్నారు.

# డిక్లరేషన్‌పై చర్చ జరగాలన్న ప్రతిపక్ష సభ్యులు

**తిరస్కరించిన మండలి చైర్మన్, కొనసాగిన ప్రశ్నోత్తరాల కార్యక్రమం**

**సచివాలయం, మార్చి19, ప్రభాతవార్త:** శాసనమండలి 42వ సమావేశంలో 5వ రోజున శనివారం ఉదయం 10 గంటలకు ఛైర్మన్ కొయ్యే మోషేన్ రాజు అధ్యక్షతన ప్రారంభం కాగానే ఎమ్మెల్సీ ఎన్నికల డిక్లరేషన్ అందించడంలో చేస్తున్న జాప్యంపై సభ్యులు ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని తిరస్కరిస్తున్నట్లు ఛైర్మన్ ప్రకటించి ప్రశ్నోత్తరాల కార్యక్రమాన్ని ఆదేశించారు. ప్రతిపక్ష సభ్యులందరూ ఒక్కసారి వారి స్థానాల నుంచి లేచీ ఛైర్మన్ పోడియం వద్ద నిలబడి ఎన్నిక డిక్లరేషన్ ఫామ్ అందించాలని కోరుతూ నినాదాలు చేశారు. విషయం ఎలక్షన్ కమిషన్ పరిధిలో అంశమని మండలిలో చర్చించే విషయం కాదని చెప్పారు. అయినా ప్రతిపక్ష సభ్యులు వినకుండా డిక్లరేషన్ ఇవ్వకుండా తాత్సారం చేస్తున్న అనంతపురం కలెక్టర్, ఎస్పీలను సస్పెండ్ చేయాలని నినాదాలు చేశారు. ఇలా నినాదాలు చేసి సభ కార్యక్రమాలకు ఆటంకం కలిగించడం ప్రజాస్వామ్యం కాదని సభ్యులకు నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు.

# టిఎస్‌పిఎస్‌సి లీకేజీ వ్యవహారం.. రాష్ట్ర ప్రభుత్వ చేతకాని తనమే

- కప్పిపుచ్చుకోవడం బిజెపి మీద అబద్ధాల ప్రచారం
- బిఆర్ఎస్ తీరుపై మండిపడిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి
- త్వరలో మరో వందేభారత్ రైలు సికింద్రాబాద్ నుంచి తిరుపతికి



**హైదరాబాద్, మార్చి 19, ప్రభాతవార్త:** మద్యం కేసు డైవర్ట్ చేసేందుకు మహిళా బిల్లు పోరాటం బిఆర్ఎస్ చేస్తుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. మహిళల గురించి మాట్లాడే నైతకి హక్కు బిఆర్ఎస్‌కు లేదని, మద్యం వ్యాపారం చేసింది ఎవరు? డబ్బులు తీసుకుంది ఎవరు అంటూ ప్రశ్నించారు. అత్యధికమైన మహిళా ఎమ్మెల్యేలు, ఎంపిలు,మంత్రులు బిజెపిలో ఉన్నారన్నారు. కీలక పదవుల్లో మహిళలకు బిజెపి స్థానం కల్పించిందన్నారు. ఎయిర్‌ఫోర్స్‌లో వార్ విభాగానికి మహిళను ఇంచార్జ్‌గా నియమించారు. ఏ దేశంలో ఇలా నియమించలేదన్నారు. మహిళలు అంటే ఏమిటో బిజెపికి తెలుసునన్నారు. ట్రిపుల్ తలాక్ మేం రద్దు చేసే సిఎం కెసిఆర్ వ్యతిరేకించారన్నారు. ఆయన మిత్రుడు బాధపడతారని, ట్రిపుల్ తలాక్‌ను కేసిఆర్ వ్యతిరేకించారని, ఐదు సంవత్సరాలు మహిళా మంత్రులు లేరని, 33 శాతం రిజర్వేషన్ల ముందు మీరు అమలు చేయాలన్నారు. టిఎస్‌పిఎస్సీ లీకేజీ వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వానిదే బాధ్యత అని, చేతకాని తనం అన్నారు.

ప్రపంచం మొత్తం భారత్ వైపు చూస్తుంటే సిఎం కెసిఆర్ మాత్రం వారి కుటుంబం వైపు చూస్తున్నారని కిషన్‌రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రజలే కల్వకుంట్ల కుటుంబాన్ని లొంగదీసుకుంటారు తప్పు లేకుండా ఈడి ఎవరిని ప్రశ్నించదన్నారు. మద్యం వ్యాపారంచేసింది మీరు డబ్బులు తీసుకుంది మీరు అన్నారు. కొంపలు మునుగుతున్నట్లు బిఆర్ఎస్ నాయకులు ఢిల్లీ వచ్చారన్నారు. మహిళలను ఇంటికి వచ్చే విచారించాలనే చట్టం ఉందని నాకు తెలియదని, దానిపై సుప్రింకోర్టులో తేల్చుకోవాలని అన్నారు. లిక్కర్ కేసుఎక్కడ మొదలైంది, కేసు మొదట ఎక్కడ రిజిస్టర్ అయిందని ప్రశ్నించారు. అప్పట్లో మద్యం రేట్లు పెరిగాయని వార్తలు వచ్చాయని, ఆ సమయంలో సిబిఐకి ఫిర్యాదు చేశారన్నారు. అప్పుడు కల్వకుంట్ల కుంట్ల ఉందని తెలియదన్నారు. ఆ రోజు వచ్చిన ఫిర్యాదులతో సిబిఐ దర్యాప్తు ప్రారంభించిందన్నారు. తీగ లాగితే డొంక కదిలినట్లు, ఒకరి తరువాత ఒకరు బయటకు వచ్చారని, కల్వకుంట్ల కుటుంబం మద్యం వ్యాపారంచేస్తున్నట్లు మాకు తెలియదన్నారు. మద్యం వ్యాపారం తాము చేయమన్నామా? తెలంగాణ సమాజం చేయమన్నదా అంటూ ప్రశ్నించారు.

2014లో జరిగిన ఎన్నికల్లో అవినీతిపై గెలిచామన్న కిషన్‌రెడ్డి, ఎర్రకోట నుంచి ప్రధాని మా పోరాటం అవినీతి, కుటుంబ పాలనపైనే అని పిలుపునిచ్చారు. అబద్దాలపై ప్రభుత్వాన్ని నడుపుతున్నారని, అబద్దాలకు ప్రతిరూపం కల్వకుంట్ల కుటుంబం అన్నారు. అబద్దాలకు ప్రతిరూపం బిఆర్ఎస్ పార్టీ అన్నారు. సంగీత నాటక విభాగాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తున్నాం అన్నారు. దానికి భూమి కావాలని, ఒక అద్భుతమైన కల్చరల్ కాంప్లెక్స్ ఏర్పాటు చేస్తామన్నారు. హైదరాబాద్‌లో సైన్స్ సిటీ ఏర్పాటుకు స్థలాన్ని అడుగుతున్నామని, చాలా ఉత్తరాలు రాశానన్నారు. ఒక్క దానికి కెసిఆర్ నుంచి జవాబు లేదన్నారు. ఎంఎంటిఎస్ రెండో దశ పూర్తిచేద్దామని లేఖ రాసినట్లు సమాధానం లేదన్నారు. సికింద్రాబాద్ స్వప్నలోక్ కాంప్లెక్స్‌ను పరిశీలించినట్లు, వరుస అగ్ని ప్రమాదాలలో 29 మంది చనిపోయారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా కొంత బాధ్యత తీసుకోవాలన్నారు. బిజెపికేసంబంధం లేదనిమాపై ఆరోపణలుచేస్తున్నాయన్నారు. అవినీతి పరులకు కొమ్ముకాస్తూ దివాళా కోరుతనంతో ప్రభుత్వం వ్యవహరిస్తుందని, దోషులను శిక్షించాలన్నారు. ఆత్మ నిర్భన్ భారత్ కార్యాలయంలో భాగంగా టెక్స్‌టైల్ రంగంలో మనదేవాన్ని ప్రపంచంలోనే ఉన్నతమైన స్థానాన్ని నిలపాలనే సంకల్పంతో పిఎం మిత్ర ప్రధానమంత్రిగా మెగా ఇంటిగ్రేటెడ్ టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేయాలని కేంద్రం నిర్ణయించింది. దానితో తెలంగాణ రాష్ట్రాన్ని ఎంపిక చేయడం, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి తెలంగాణ టెక్స్‌టైల్ కార్మికులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

మొదటి దశంలో రూ.4445 కోట్లు అందించనుందన్నారు. పిఎం మిత్ర టెక్స్‌టైల్ పార్కుల కోసం అనేక ప్రతిపాదనలు వచ్చాయన్నారు. మేకిన్ ఇండియా అంటే జోకిన్ ఇండియా అంటారు. దేశ అభివృద్ధిని దేశం గౌరవాన్ని కార్మికుల శ్రమను, శాస్త్రవేత్తల పరిశోధనలను అవహేళన చేయకుండా అందరం కలిసి పనిచేయాలన్నారు.

# విద్యుత్‌షాక్‌కు గురై గజరాజు మృత్యువాత

**కుప్పం, మార్చి 19 ప్రభాతవార్త:** హై టెన్షన్ విద్యుత్ తీగలు తగిలి ఓ గజరాజు మృతి చెందిన సంఘటన కుప్పంకు సుమారు 80 కి.మీ.ల దూరంలోని తమిళ నాడు రాష్ట్రం ధర్మపురి జిల్లా కంబై నల్లూరు గ్రామంలో చోటు చేసుకుంది. గత పదిహేను రోజుల్లోనే ఈ జిల్లాలో నాలుగు ఏనుగులు విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందడం గమనార్హం. కంబై నల్లూరువద్ద పంట పొలాల్లో తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలు అటుగా వెళ్తున్న ఏనుగుకు ఒక్కసారిగా తగలడంతో ఏనుగు కుప్పకూలింది. ధర్మపురి జిల్లా డిఎఫ్ఒ అప్పలనాయుడు మాట్లాడుతూ ఎనిమిది నెలల క్రితం కర్ణాటకలోని హాసన్ అటవీ ప్రాంతంలో ఉన్న ఈ ఏనుగు అక్కడ పంటలను ధ్వంసం చేస్తుండడంతో కర్ణాటక వైపు తరలించారన్నారు. అయితే గత కొన్ని రోజులుగా మృతి చెందిన ఏనుగు ధర్మపురి జిల్లా పిక్కిలి గ్రామ సమీపంలో తిరుగుతూ పంటలను ధ్వంసం చేసేదని దీంతో రైతులు తీవ్ర ఆవేదనకు లోనై ఏనుగు బారినుంచి పంటలను రక్షించాలని కోరడం జరిగిందని మరో అటవీ అధికారి పేర్కొన్నారు. ఈ ఏనుగును అటవీ ప్రాంతంలో దారి మళ్లించేందుకు ప్రయత్నాలు చేయగా కారిమంగళం ప్రాంతం గుండా కంబై నల్లూరు ప్రాంతానికి చేరుకుందన్నారు. అక్కడ పంట పొలాల వద్ద విద్యుత్ షాక్‌కు గురై మృత్యువాత పడింది.

